క్లుప్తంగా

చలివేంద్రం ప్రారంభం



ఎల్కతుర్తి : భీమదేవరపల్లి మండలం ముల్కనూర్‌లోని బస్టాండ్ సమీపంలో బీజేపీ మండల అధ్యక్షుడు పైడిపల్లి పృథ్వీరాజ్ గురువారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రయాణికులకు దప్పిని తీర్చేందుకు ప్రతీ ఏడాది వేసవిలో చలివేంద్రం ఏర్పాటు చేసి శుద్ధజలం అందిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని మండల ప్రజలు, ప్రయాణికులు, బాటసారులు వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు దొంగల కొమురయ్య, గుండు సారయ్య, ఊసకోయిల కిషన్, శివసాగర్, వేణు, భిక్షపతి, భాస్కర్, రాహుల్, అక్షయ్, శివమణి తదితరులు పాల్గొన్నారు.

గుడి స్థలాన్ని కాపాడాలి

నడికూడ : మండలంలోని కంఠాత్మకూర్‌లో గల పోచమ్మ గుడి స్థలాన్ని కొందరు కబ్జా చేశారంటూ గ్రామస్తులు ఆరోపించారు. కంఠాత్మకూర్‌కు చెందిన పింగిలి ప్రతాపరెడ్డిదొర 20 గుంటల భూమిని దానం చేయగా ప్రస్తుతం రెండు గుంటలు కూడా లేదని ఆరోపించారు. కాగా పోచమ్మగుడికి ఆనుకుని ఉన్న బాయ్ సమ్మయ్య తనకు పట్టా భూమి ఉందని చెబుతూ ఇంటి నిర్మాణం చేపడుతున్నాడని అందులో గుడి స్థలం ఉందని గ్రామస్తులు ఆరోపిస్తూ గ్రామపంచాయతీ కార్యదర్శికి ఫోన్లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

కౌన్సిలర్ చేయూత



పరకాల : రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన సుదలమల్ల స్వప్నతోపాటు అనారోగ్యంతో మృతి చెందిన బండారు కన్నయ్య కుటుంబాలకు 9వ వార్డు కౌన్సిలర్ బెజ్జంకి పూర్ణాచారి గురువారం చేయూతనిచ్చారు. బాధిత కుటుంబాలకు 25 కిలోల సన్నబియ్యంతోపాటు కొంత ఆర్థికసాయం అందించారు.

గ్రామాభివృద్ధికి కృషి



దామెర: గ్రామాభివృద్ధికి తనవంతుగా కృషి చేస్తానని రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్ అన్నారు. మండలంలోని ముస్త్యాలపల్లికి చెందిన ఆయన గురువారం గ్రామానికి రాగా మాజీ సర్పంచ్ వడ్డెపల్లి శ్రీనివాస్ గజమాల, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రియాజ్ మాట్లాడుతూ.. గ్రామాభివృద్ధికి తనవంతు సహకారం అందజేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉద్యమనేత, కేయూ జాక్ సభ్యుడు మంద వీరస్వామి, నాయకులు తోట కుమారస్వామి, మధు, దండు విజేందర్, శంకర్, రియాజ్ కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రామకృష్ణకు అవకాశం ఇవ్వాలి

నయీంనగర్: కాంగ్రెస్ పార్టీ వరంగల్ ఎంపీ స్థానాన్ని డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణకు కేటాయించాలని ట్రై సిటీ క్రిష్టియన్ ఫెలోషిప్ అధ్యక్షుడు రెవ.పాస్టర్ ఐజాక్, ఉపాధ్యక్షుడు రెవ.పాస్టర్ జోసఫ్ ప్రభాకర్ ఏఐసీసీ నేతలతోపాటు, సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. ఈమేరకు గురువారం హనుమకొండ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడారు. వరంగల్ పార్లమెంట్ పరిధిలో మూడున్నర లక్షల దళిత క్రిష్టియన్ల ఓట్లు ఉన్నాయన్నారు. రామకృష్ణకు టికెట్ ఇస్తే గెలిపించుకుంటామని తెలిపారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేల గెలుపులో రామకృష్ణ కీలకపాత్ర పోషించారని తెలిపారు. విద్యావంతుడిగా.. పేదల డాక్టర్‌గా ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవ చేస్తున్నాడన్నారు. ఈ కార్యక్రమంలో సువర్ణ రాజ్, లాజరస్, తాళ్లపెల్లి ప్రసంగి, డేవిడ్, సంతోష్ పాల్గొన్నారు.

మహిళలు సఖి సేవలు వినియోగించుకోవాలి

హన్మకొండ అర్బన్ : సఖి కేంద్రం సేవలను మహిళలు వినియోగించుకోవాలని సఖి వన్ స్టాప్ కేంద్రం కౌన్సిలర్ విజయలక్ష్మి, కేస్ వర్కర్ వినీల సూచించారు. నగరంలోని రెవెన్యూ కాలనీలో జేఎస్‌ఎస్ సంస్థ ఆధ్వర్యంలో బ్యూటీషియన్, టైలరింగ్ శిక్షణ పొందుతున్న మహిళలకు గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆపదలో ఉన్న మహిళలకు సఖి కేంద్రం అండగా నిలుస్తుందన్నారు. సఖి వన్ స్టాప్ కేంద్రం ద్వారా మహిళలకు అందజేస్తున్న సేవలను వివరించారు. మహిళలు, బాలికలు అత్యవసర సమయాల్లో సాయం కోసం 0870-2452112 నంబర్, టోల్ ఫ్రీ నంబర్ 181కు ఫోన్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో జేఎస్‌ఎస్ సంస్థ డైరెక్టర్ ఎండీ ఖాజా, ప్రాజెక్ట్ మేనేజర్ తిరుపతితో పాటు మహిళలు పాల్గొన్నారు.

భూ కబ్జాదారులను వదిలిపెట్టేదిలేదు

● ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

శాయంపేట : 'గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో కొందరు అక్రమార్కులు గుట్టలను, ఇతర భూములను కబ్జా చేసి పేదలకు అన్యాయం చేశారు. వారిని వదిలిపెట్టేదిలేదు. చట్టపరంగా అన్ని బయటికితీసి వారి భరతం పడతా' అని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు ధ్వజమెత్తారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన మాట్లాడారు. మండలంలో అపార ఖనిజ సంపద ఉందని దాన్ని కాపాడుతానని అన్నారు. సంపద నుంచి వచ్చే సీఎస్ఆర్, డీఎంఎఫ్‌టీ నిధులను నియోజకవర్గ అభివృద్ధికి ఖర్చు చేస్తామన్నారు. భూపాలపల్లి జిల్లాలోని గాంధీనగర్ గుట్ట ప్రాంతాన్ని కొందరు నాయకులు కాజేయగా అధికారుల సహకారంతో ఆ భూమిని కాపాడి రూ. 200కోట్లతో విద్యార్థుల చదువు కోసం ఇంటిగ్రేట్ భవనాలు నిర్మిస్తున్నామన్నారు. అధిక వర్షాలతో నియోజకవర్గంలో 124 చెరువులకు నష్టం వాటిల్లిందని, ఈ అంశం సీఎం దృష్టికి తీసుకెళ్లి 122 చెరువుల అభివృద్ధికి నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. వర్షాకాలం పంటల వరకు శాశ్వత పనులు పూర్తి చేస్తామన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరూ కష్టపడి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించి సీఎం రేవంత్‌రెడ్డికి కానుకగా ఇవ్వాలన్నారు. రాహుల్ గాంధీని ప్రధాని చేయడమే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త పనిచేయాలని పిలుపునిచ్చారు.

పార్టీలో చేరిన పలువురు

మండలంలోని కొప్పుల గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్‌లు సామల సౌమ్యమధుసూదన్, గుర్రం రవీందర్, చేనేత సొసైటీ చైర్మన్ దాసరి కుమారస్వామి, మాజీ ఉపసర్పంచ్ కుమ్మరి కుమారస్వామి, బేతు ఆదిరెడ్డి, సీనియర్ నాయకులు బుచ్చిరెడ్డి, జలేందర్‌రెడ్డి, రాజ్‌కుమార్, తిరుపతి, మాజీ వార్డు సభ్యులు సుధాకర్, శంకర్, భద్రయ్య, తిరుపతి, సారంగపాణి, మహేందర్‌రెడ్డితోపాటు 200మంది ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరగా వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. మాజీ జెడ్పీటీసీ చక్రపాణి, పరకాల మాజీ ఏఎంసీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు రవి, శాంతరవి, కృష్ణమూర్తి, పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లకు షెడ్ల నిర్మాణం



మాట్లాడుతున్న చైర్మన్ సంపత్‌రావు

కమలాపూర్ : మండలంలోని గూడూరు, వంగపల్లి గ్రామాల్లోని రైతుల ధాన్యం కొనుగోళ్లకు షెడ్ల నిర్మాణం, గూడూరులో ఫంక్షన్‌హాల్ నిర్మాణం చేపట్టనున్నట్లు పీఏసీఎస్ చైర్మన్ పేరాల సంపత్‌రావు తెలిపారు. మండల కేంద్రంలోని పెట్రోల్‌బంక్ ఆవరణలోని గోదాంలో సంఘం 64 వార్షిక, 82 సర్వసభ్య సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా డైరెక్టర్లు 2023-2024 వార్షిక సంవత్సర ఖర్చులు, జమలను చదివి వినిపించి 2024-2025 వార్షిక బడ్జెట్‌ను ఆమోదించారు. అలాగే సంఘం ఆధ్వర్యంలో చేపట్టబోయే నిర్మాణాలను ప్రతిపాదించి ఆమోదించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, డైరెక్టర్లు సత్యనారాయణరావు, రమేష్‌బాబు, ఎడ్వర్డ్, కుమారస్వామి, యాదగిరి, సురేందర్, సంఘం సభ్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రేపు జాబ్‌మేళా

హన్మకొండ చౌరస్తా : ఈనెల 30వ తేదీన హనుమకొండ చౌరస్తాలోని ఎంఎస్ రెడ్డి కాంప్లెక్స్‌లో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ఎంఎస్‌కే సర్వీసెస్ ఎండీ మేఘన శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. గూగుల్ పే సంస్థలో పనిచేసేందుకు నిర్వహించే ఇంటర్వ్యూలకు పది, ఇంటర్మీడియట్ విద్యార్హత కలిగినవారు అర్హులుగా పేర్కొన్నారు. హనుమకొండ, వరంగల్ ప్రాంతాల్లో ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని, నెలకు రూ.20వేల వేతనం ఉంటుందని తెలిపారు. సందేహాలుంటే 82473 58727 నంబర్ ద్వారా సంప్రదించాలని సూచించారు.

నేడు జక్రియాలో ఇఫ్తార్

హన్మకొండ చౌరస్తా : వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి నేడు (శుక్రవారం) హనుమకొండ రాయపురలోని జక్రియా ఫంక్షన్ హాల్‌లో ఇఫ్తార్ విందును ఏర్పాటు చేయనున్నారు. సాయంత్రం 5.30 గంటలకు నిర్వహించే ఇఫ్తార్‌కు ముస్లింలు హాజరు కావాలని కోరారు.

'ఇండియా కూటమి గెలుపే లక్ష్యం'



సమావేశంలో మాట్లాడుతున్న భిక్షపతి

దామెర : ఇండియా కూటమి గెలుపే లక్ష్యంగా శ్రేణులు పని చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి కోరారు. మండలంలోని ఓగ్లాపూర్‌లో గురువారం నిర్వహించిన పార్టీ మండల సమితి సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. బీజేపీ ఏటా రెండు కోట్ల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చి కేంద్రంలో గద్దెనెక్కి పదేళ్లుగా ఉన్న ఉద్యోగాలు తొలగిస్తోందని విమర్శించారు. ప్రభుత్వ సంస్థలను నిర్వీర్యం చేస్తోందని, ప్రజాధనాన్ని కార్పొరేట్ శక్తులకు దోచిపెడోతందని ధ్వజమెత్తారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను చిత్తుగా ఓడించాలని ప్రజలను కోరారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజల్లో ఉంటూ బీజేపీ ప్రభుత్వం చేపడుతున్న తప్పుడు విధానాలపై ప్రజలను చైతన్యవంతం చేయాలని సూచించారు. అలాగే ఇండియా కూటమి అభ్యర్థులను లోక్‌సభ ఎన్నికల్లో గెలిపించేలా కృషి చేయాలని చెప్పారు. ఈ సమావేశానికి జిల్లా సమితి సభ్యుడు కొట్టెపాక రవి అధ్యక్షతన వహించగా మండల కార్యదర్శి అంబి సాంబయ్య, నాయకులు దండు భాస్కర్, ఎడ్ల మంజుల, అమ్మ సాంబయ్య, గంధం శోభ, జయ, శివ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో స్నేహభావం పెంపొందుతోంది



హసన్‌పర్తి: క్రీడలతో స్నేహభావం పెంపొందుతోందని కార్పొరేటర్ అభినవ్ భాస్కర్ అన్నారు. ముచ్చర్లలోని మిలినియ్ పాఠశాల మైదానంలో నాలుగు రోజులపాటు నిర్వహించిన జిల్లా స్థాయి క్రికెట్‌పోటీలు గురువారం ముగిశాయి. ఈకార్యక్రమానికి దాస్యం అభినవ్ భాస్కర్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. క్రీడలతో శారీరక ధృడత్వంతోపాటు మానసిక ప్రశాంతత చేకూరుతోందన్నారు. ఈపోటీల్లో ఖిలా వరంగల్ జట్టు విన్నర్‌గా రూ.50వేలు నగదు అందుకుంది. ముచ్చర్ల జట్టు రన్నరప్‌గా నిలిచి రూ.25నగదు బహుమతి అందుకుంది. అరూరి గట్టుమల్లు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈపోటీలు జరిగాయి. కార్యక్రమంలో అరూరి గట్టుమల్లు ఫౌండేషన్ కార్యదర్శి అరూరి విశాల్, స్థానికులు చల్లా వెంకటేశ్వర్‌రెడ్డి, చిర్ర రాజు, వీరస్వామి, ప్రమోద్, అనిల్, రాజేష్, సుమన్ పాల్గొన్నారు.

అర్హులందరూ తప్పనిసరిగా ఓటేయాలి



ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

నర్సంపేట రూరల్ : అర్హులందరూ తప్పనిసరిగా ఓటేయాలని నోడల్ అధికారి కొర్ర సారయ్య, ఆదర్శ మండల సమాఖ్య ఏపీఎం మహేందర్ కోరారు. నర్సంపేట మండల ఆదర్శ సమాఖ్య కార్యాలయం నుంచి గురువారం నిర్వహించిన ర్యాలీను వారు ప్రారంభించి మాట్లాడారు. ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. 18 ఏళ్ల వయస్సు కలిగిన ప్రతీఒక్కరికి రాజ్యాంగం ఓటు హక్కు కల్పించిందని చెప్పారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేలా అర్హులందరూ నిజాయితీగా, తప్పనిసరిగా ఓటేయాలని సూచించారు. పౌరులకు ఓటుహక్కు వజ్రాయుధమని, తప్పనిసరిగా ఓటుహక్కు వినియోగించుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా సమాఖ్య ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

ఖిలా వరంగల్ : సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఇన్‌స్పెక్టర్ మల్లయ్య సూచించారు. వరంగల్ మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్ ఆవరణలో గురువారం ఎస్సై మున్నీరుల్లా ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం పెంపొందినప్పటికీ అదే స్థాయిలో సైబర్ నేరగాళ్లు పలు రకాల మోసాలకు పాల్పడుతున్నారని వివరించారు. సెల్ ఫోన్‌కు వచ్చే మెసేజ్‌లు, లింక్‌లతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

రైతు ఆత్మహత్యలు ప్రభుత్వ హత్యలే

● మాజీ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న సుదర్శన్‌రెడ్డి

నల్లబెల్లి : రైతుల ఆత్మహత్యలను ప్రభుత్వ హత్యలుగా నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అభివర్ణించారు. మండలంలోని ఆసరవెల్లి గ్రామానికి చెందిన రైతు నూనావత్ నవీన్ ఇటీవల అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకోగా బాధిత కుటుంబాన్ని గురువారం మాజీ ఎమ్మెల్యే పరామర్శించి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం సాగునీటి, విద్యుత్ సరఫరాలో మోసపూరితంగా వ్యవహరిస్తుండడంతో పంట దిగుబడి తగ్గి రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. తొలుత మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి రూ.25 వేల సాయం అందజేశారు. నవీన్ కుటుంబానికి రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు బానోత్ సారంగపాణి, నల్లబెల్లి పీఏసీఎస్ చైర్మన్ చెట్టుపల్లి మురళీధర్, వైస్ చైర్మన్ తక్కళ్లపల్లి మోహన్‌రావు, బీఆర్‌ఎస్ మండల ప్రధాన కార్యదర్శి, నాయకులు ప్రవీణ్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్, రాజేశ్వర్‌రావు, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీదే గెలుపు

హన్మకొండ: వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గంలో ఈ సారి బీజేపీ విజయం సాధిస్తుందని ఆ పార్టీ అభ్యర్థి అరూరి రమేష్ ధీమా వ్యక్తం చేశారు. గురువారం హనుమకొండ ప్రశాంత్‌నగర్‌లోని స్వగృహంలో స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గం జఫర్‌ఘడ్ మండలం వడ్డెగూడేనికి చెందిన బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు బీజేపీ మండల అధ్యక్షుడు కోరుపప్పుల నగేష్ గౌడ్ ఆధ్వర్యంలో బీజేపీలో చేరగా రమేష్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారు రమేష్‌ను సన్మానించారు.

అనధికార విద్యుత్ కోతలతో ఇక్కట్లు

వర్ధన్నపేట : అనధికార విద్యుత్ కోతలతో పట్టణ ప్రజలు ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. నాలుగు రోజులుగా పట్టణంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, మళ్లీ మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది. అసలే ఎండ కాలం. రోజురోజుకూ ఎండ పెరుగుతోంది. పదో తరగతి విద్యార్థులు పరీక్షలకు సిద్ధమవడంలో సమస్యలు ఎదుర్కొంటున్నామని పట్టణవాసులు వాపోతున్నారు. రంజాన్ ఉపవాస దీక్షల సమయంలో అనధికారికంగా విద్యుత్ కోతలు పెడుతూ వేదనకు గురి చేస్తున్నారంటూ ముస్లింలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ సరఫరా లేక నష్టపోతున్నామంటూ వాణిజ్య, వ్యాపార వర్గాలు తెలిపాయి. ఇక అన్ని వర్గాల ప్రజలకు ఉక్కపోత తప్పడం లేదు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు స్పందించి అనధికార విద్యుత్ కోతలు మానుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

ప్రజాసంఘాల ధర్నా

నర్సంపేట : దళిత సామాజికవర్గానికి చెందిన ధర్మారపు ప్రకాశ్‌పై దాడి చేసిన వారిపై ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ, హత్యాయత్నం కేసు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేద్కర్ సెంటర్‌లో గురువారం ధర్నా చేశారు. నాయకుడు ప్రణయ్‌దీప్ మాట్లాడారు. మహబూబాబాద్ జిల్లాలోని తొర్రూరు మండలం చెర్లపాలెం గ్రామానికి చెందిన ధర్మారపు ప్రకాశ్‌పై నర్సంపేటకు చెందిన వ్యక్తులు కులం పేరుతో దూషిస్తూ చితకబాదారని తెలిపారు. కాగా హనుమకొండలోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ప్రకాశ్‌ను పరామర్శించారు.

పేద విద్యార్థుల ఉన్నతే ధ్యేయం

సంగెం : పేద విద్యార్థుల ఉన్నతే ధ్యేయంగా కార్యక్రమాలు చేపడుతున్నట్లు హనుమకొండ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సర్వరొద్దీన్ తెలిపారు. మండలంలోని కాపులకనపర్తి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలకు క్లబ్ ఆధ్వర్యంలో ఆయన లక్ష రూపాయల విలువైన ప్రాజెక్టర్‌ను బహూకరించారు. అనంతరం గ్రామంలోని ఉచిత శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లతోపాటు 11 కుట్టుమిషన్లు ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా సర్వరొద్దీన్ మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఎక్కువగా పేద విద్యార్థులే చదువుతారని, డిజిటల్ తరగతులతో వారికి లబ్ధి చేకూరుతుందని చెప్పారు. దృశ్య, శ్రవణ పద్ధతుల్లో బోధించడంతో పాఠ్యాంశం పూర్తిగా అవగతమవుతుందని తెలిపారు. విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి అన్ని రంగాల్లో రాణించాలని, మహిళలు స్వయం ఉపాధితో ఆర్థికంగా బలోపేతం కావాలని ఆకాంక్షించారు. క్లబ్ అధ్యక్షుడు రమేశ్, గవర్నర్ వెంకటేశ్వర్‌రావు, పీడీజీ ప్రొఫెసర్ గోపాల్‌రెడ్డి, ఆర్‌సీకే సుబ్రాక్, నిర్మల, రాంచందర్‌రావు, శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా జరగాలి



పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఏసీపీ తిరుమల్

కమలాపూర్ : రానున్న పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా ముందస్తు చర్యలు చేపట్టాలని కాజీపేట ఏసీపీ పుప్పాల తిరుమల్ సిబ్బందికి సూచించారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని కమలాపూర్ పోలింగ్‌స్టేషన్‌తో పాటు ఉప్పల్, కన్నూర్ గ్రామాల్లోని పోలింగ్ స్టేషన్లను గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన టాయిలెట్స్, విద్యుత్, తదితర వసతులను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. మండల వ్యాప్తంగా ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునే విధంగా ఏర్పాట్లు చేయాలన్నారు. అదే విధంగా ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చూడాలని పోలీస్ సిబ్బందిని ఆదేశించారు. అనంతరం కన్నూరులోని అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి విద్యార్థుల ఆరోగ్యానికి సంబంధించి అంగన్‌వాడీ టీచర్లకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక పోలీస్ ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ, ఎస్సై వీరభద్రరావు, పోలీస్ సిబ్బంది, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

బెల్ట్‌షాప్‌పై టాస్క్‌ఫోర్స్ అధికారుల దాడులు



మద్యం పట్టుకున్న టాస్క్‌ఫోర్స్ అధికారులు

ఎల్కతుర్తి : మండలంలోని ఆరేపల్లి గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఓ కిరాణా షాపుపై టాస్క్‌ఫోర్స్ అధికారులు గురువారం ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. రూ. 10,800 విలువ చేసే మద్యం బాటిళ్లను సీజ్ చేసినట్లు అధికారులు తెలిపారు. మద్యం విక్రయిస్తున్న ఎలిగేటి రమేష్‌పై కేసు నమోదు చేసినట్లు ఏసీపీ మధుసుధన్ పేర్కొన్నారు. అలాగే దామెరలోని బెల్టుషాపులపై దాడులు నిర్వహించి రూ. 30 వేల మద్యాన్ని స్వాధీనం చేసుకుని భాస్కర్, రాజిరెడ్డిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. కేశపురంలోని బెల్టుషాపుల్లో రూ. 25వేల మద్యాన్ని స్వాధీనం చేసుకుని ఇద్దరిపై కేసు నమోదు చేశామన్నారు. అలాగే గోపాల్‌పూర్‌లో రూ. 4వేలు విలువ చేసే మద్యాన్ని స్వాధీనం చేసుకుని ఒకరిపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. కానిస్టేబుల్ బక్కయ్య తదితరులు పాల్గొన్నారు.

సహకార సంఘం అభివృద్ధికి సహకరించాలి

● సింగిల్‌విండో చైర్మన్ శ్రీపతి రవీందర్‌గౌడ్



మాట్లాడుతున్న చైర్మన్ రవీందర్‌గౌడ్

ఎల్కతుర్తి : ది విశాల సహకార సంఘం అభివృద్ధికి పాలకవర్గ సభ్యులతో పాటు వినియోగదారులు సహకరించాలని సింగిల్‌విండో చైర్మన్ శ్రీపతి రవీందర్‌గౌడ్ కోరారు. మండల కేంద్రంలోని సింగిల్‌విండో కార్యాలయం ఆవరణలో విశాల సహకార సంఘం 69వ వార్షిక మహాసభ గురువారం జరిగింది. ఈ సందర్భంగా బ్యాంక్ సిబ్బంది బ్యాంక్ లావాదేవీలు, జమ, ఖర్చులను చదివి వినిపించారు. అనంతరం చైర్మన్ రవీందర్‌గౌడ్ మాట్లాడుతూ.. గతంలో 4,257 మంది సభ్యులు ఉండగా ప్రస్తుతం 5,339 మంది సభ్యులు కొనసాగుతున్నారని అన్నారు. దీన స్థితిలో ఉన్న బ్యాంక్‌ను అభివృద్ధిలోకి తీసుకొచ్చామన్నారు. కొత్తపాలకవర్గం ఎన్నికకు ముందు రూ.85,1061 ఉన్న వాటాధనాన్ని పాలకవర్గం ఎన్నిక అనంతరం రూ.1కోటి 49లక్షల 41వెయ్యి వాటాధనం పెరిగిందన్నారు. రైతులకు రూ. 270కే యూరియా బస్తాను అందించడం జరుగుతుందన్నారు. అలాగే సంఘం సభ్యులకు ఇప్పటి వరకు రూ. 60కోట్ల రుణాలు ఇవ్వడం జరిగిందన్నారు. తీసుకున్న రుణాలకు సకాలంలో వడ్డీ చెల్లించాలని రైతులను కోరారు. రెగ్యూలర్‌గా డబ్బులు చెల్లించే సభ్యులకు పావలా వడ్డీ మాత్రమే వర్తిస్తుందన్నారు. గతంతో పోల్చుకుంటే బ్యాంక్ రూ. 50లక్షల లాభాల్లో కొనసాగుతుందన్నారు. గతంలో బ్యాంక్‌లో జరిగిన అవినీతిని కోర్టు తీర్పు మేరకు అవినీతికి పాల్పడిన వారి నుంచి డబ్బులు వసూలు చేయనున్నట్లు తెలిపారు. రానున్న రోజుల్లో బ్యాంక్ తరుపున మండల కేంద్రంలో పెంట్రోల్‌బంక్ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. అలాగే బ్యాంక్‌లో సభ్యత్వం కలిగిన సభ్యులు ఎవరైనా మృతి చెందితే దహన సంస్కారాలకు రూ. 5వేలు సాయం అందించే విధంగా తీర్మానం చేశామన్నారు. సంఘం అభివృద్ధికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. వైస్ చైర్మన్ మునిగడుప శేషగిరి, పాలకవర్గ సభ్యులు లోకిని సూరయ్య, బచ్చు వెంకట్రావ్, కాగితాల శ్రీనివాస్, ఐలయ్య, మహేందర్, సంధ్య, సమ్మక్క, సమ్మయ్య, రాజిరెడ్డి, కృష్ణమూర్తి, పోచయ్య పాల్గొన్నారు.

లక్ష్మీనృసింహుడికి స్వాతి నక్షత్రోత్సవం



అమ్మవార్లకు మంగళహారతి ఇస్తున్న అర్చకులు, భక్తులు

ఐనవోలు : మండలంలోని కక్కిరాలపల్లిలోని నారసింహుడికి, గర్భాలయంలోని శ్రీలక్ష్మీనృసింహుడికి స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకుని పంచామృతాలు, పండ్ల రసాలతో అభిషేకం నిర్వహించారు. గురువారం ఉదయం స్వామి, అమ్మవార్లకు నిత్య కైంకర్యాలు పూర్తి అయిన తర్వాత ధ్రువ మూర్తులకు, ఉత్సవ మూర్తులకు పంచామృతాలతో అర్చకులు పంచసూక్తం పఠిస్తు విశేషంగా అభిషేకం జరిపించారు. అనంతరం లక్ష్మీ-నరసింహస్వామి, శ్రీదేవి, భూదేవి-వేంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తులకు మాస కల్యాణం పాంచరాత్ర ఆగమానుసారం వేదోక్తంగా జరిపించారు. ఈ సందర్భంగా నీరాజన మంత్రపుష్పంతో పాటు నక్షత్రహారతి సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పబ్బతి సత్యనారాయణ-రాణి, ఆత్మకూరు రాధాకృష్ణ-సుజాత, ప్రదీప్-అనూష, సుధీర్-మమత దంపతులు, సురేందర్, చిట్టి, లక్ష్మి, విజయ, సంహిత కృష్ణ, ప్రతుల్ కృష్ణ, అర్చకులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనగా పండుగా వాతావరణం నెలకొంది.

వరంగల్ సీటును సీపీఐకి కేటాయించాలి

శాయంపేట : వరంగల్ పార్లమెంట్ సీటును సీపీఐకి కేటాయించాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి కోరారు. మండలంలోని పెద్దకోడెపాక రెవెన్యూ శివారులోని గుడిసెవాసుల కాలనీలో గురువారం నిర్వహించిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో జాతీయ, రాష్ట్ర స్థాయిలో వామపక్ష భావాలు కలిగిన వారిని ఎన్నుకుని మతతత్వ శక్తులకు అడ్డుకట్ట వేయాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం శాశ్వత పట్టాలు, ఇళ్లు, విద్యుత్, మౌళిక వసతులు కల్పించాలని కోరారు. అనంతరం మండల స్థాయి నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల ప్రధాన కార్యదర్శిగా బత్తిని సదానందం, సహాయ కార్యదర్శిగా అనుకారి అశోక్, సముద్రాల రవితో పాటు 23మందితో మండల కమిటీని ఎన్నుకున్నట్లు తెలిపారు. జిల్లా సహాయ కార్యదర్శి తోట భిక్షపతి, సీనియర్ నాయకులు ఎండీ.ఉస్మాన్‌పాషా, పన్నాటి రాంబాబు, రాములు, రమేష్, గౌసియా, సుల్తానా, రమేష్, రమాదేవి, రమ, ఇసాక్ అలీతోపాటు తదితరులు పాల్గొన్నారు.

పీపీఐ మండల కమిటీ ఎన్నిక

కమలాపూర్ : పీపుల్స్ పార్టీ ఆఫ్ ఇండియా (డెమోక్రటిక్) మండల అధ్యక్షుడిగా మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన అంబటి భూమయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు రాష్ట్ర ప్రధానకార్యదర్శి గడ్డం రఘు తెలిపారు. అలాగే మండల కేంద్రంలో నూతన కమిటీని ఎన్నుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఉపాధ్యక్షుడిగా అంకిల్ల రమేష్, కార్యదర్శిగా అంకిల్ల రాజమల్లును ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాజేష్, శ్రీనివాస్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.